కథా నిలయం
5736
శ్రీకాకుళం


# ప్రళయ లేఖలు

సీతారత్నం గంగారత్నం సహాధ్యాయులు. సీతారత్నానికి గంగారత్నాన్ని చూస్తే జెలసీ. క్లాసులో పక్కపక్కనే కూచుంటారు. సీతారత్నం కబుర్లాడుతూ అభినయం పట్టుతూ నవ్విస్తుంది. పాఠం విననీయదు. టీచర్ గద్దించేదాకా అంతే. గంగారత్నంతో వాళ్లింటికెళ్లి అక్కడా బాగా డిస్టర్బ్ చేస్తుంది. యేదో ఆడుదాం రమ్మంటుంది. అదీ కాకపోతే చందమామ పిల్లల మాసపత్రిక తెచ్చి చదవమంటుంది.

''నాకు టైమ్‌లేదు సీతా. ఇంటికి రాగానే మా అమ్మ పనితగిలిస్తుంది. అదీ కాకపోతే వూళ్లోనే వుండదు. ఆవిడ గొప్ప వ్యవహర్త. చాలా మంది వ్యవహారాలు పరిష్కరిస్తూ ఆనందిస్తుంది'' అన్నది గంగారత్నం. యిల్లు చిమ్ముతూనో, అంట్లగిన్నెలు తోముతూనో కంటబడుతుంది.

అయినా క్లాసులో ఫస్టో, సెకండో వస్తుంది. తెలుగు మీడియమ్. హైస్కూల్ వదలక ముందే బోయ్‌ఫ్రెండ్సు యేర్పడ్డారు. బంధువుల అబ్బాయిలే. వాళ్లు రిచ్ పీపుల్. పూర్ పీపుల్‌గాదు. ఒక్కొక్కరు దళం వేసుకు పుడతారు అనుకున్నది సీతారత్నం. తన మొహానేల పొద్దు పొడిచిందో, ఒక్కడూ పలకరించడు. వెంటారాడు. జ్యోతి అనే క్లాస్‌మేట్‌తో ఓసారి నవ్వుతూ అన్నది సీతారత్నం.

''కాకి చూపూ, బుర్రముక్కూ, గెడసబారింది గంగారత్నం. రాత్రిళ్లు దెయ్యంలాగా మేలుకుని చదువుతుందేమో! పగలల్లా పనే. ఆరోగ్యమూ మెయింటెయిన్ చేస్తుంది. ఫ్రెండ్సెట్లా యేర్పడుతారో''.

జ్యోతి నవ్వుతూ జవాబిచ్చింది. ''దానికి మన సంగీతం టీచరు ఏకసంథాగ్రాహి అని బిరుదిచ్చింది. దాన్నెవడూ పెళ్లాడడులే. నువ్వనవసరంగా జెలసీ పెంచుకోకు. దిగులుపుట్టి జబ్బు పడతావు'' అలా అని వీపు చరిచి వెళ్లిపోయింది జ్యోతి.

గంగారత్నం తప్పుతుందేమో నలుగురిలో సింపతీ చూపుతున్నట్టు నటిస్తూ నవ్వుదామని ఆశలు పెంచుకున్నది సీతారత్నం. నిరాశ యెదురైంది. పబ్లిక్‌పరీక్ష నెగ్గిందంటే యెవరో పిలకపట్టుకు పైకిలాగి వుండాలి అనుకున్నది సీతారత్నం.

ఇద్దరూ ఇంటరుకి అప్లై చేశారు జూనియర్ కాలేజీకి. యంపిసీ గ్రూపు యిచ్చారిద్దరికి. మళ్లా బాధ మొదలైంది.

ఈ గంగ యిది కానిచ్చి, ఐఐటికి అప్లై చేస్తుందో కంప్యూటర్ కోర్సుకి అటెండవుతుందో అదీ కాకపోతే యంసెట్ రాస్తుందో, ఇంజినీరింగ్‌లో చేరుతుందో అని చూస్తున్నది సీతారత్నం.

ఇంటర్ పూర్తి అయింది. గంగారత్నానికి బోయ్‌ఫ్రెండ్సు ఇండియాలో జనాభా పెరిగినట్టు పెరిగారు. కాందిశీకులు, పొలిటికల్ ఆశ్రయం కోరినవారూ, యిల్లీగల్‌గా యిండియాలో జొరబడ్డవారూ వున్నట్లు ఫ్రెండ్సు పెరిగారు. అరాచకం లేవదీద్దామని వచ్చినవారూ వున్నారుట యిండియాలో. ఇంటి దగ్గరా దింపుతున్నారు. యులయున్నున్నదేమో ఇలా పరిపరివిధాల మనస్సు పరుగెడుతుండగా, సీతారత్నానికి తళుక్కున ఒక ఆలోచన వచ్చింది.

ఈ గంగకి, ప్రేమలేఖలూ, ప్రణయ లేఖలూ వస్తూ వుండి వుండాలి. యేమని రాస్తారో చదివి చూడాలి, అని నిశ్చయం చేసుకున్నది. ఆపుకోలేక ఒంటరిగా వుండగా గంగారత్నాన్నే అడిగింది.

''రోజుకెన్ని లౌ లెటర్సొస్తాయి గంగా?''

గంగ నవ్విన నవ్వుకి అర్థం తెలియలేదు సీతారత్నానికి.

'' ఇదిగాదు పని. యిదిట్లా బైట పెట్టదు. ఇది లేనప్పుడేదో మిష మీద వాళ్లింటికెళ్లి చూడాలి. వాళ్ల వాళ్ల దగ్గర నాకు బాగా చనువున్నది. శాన్నాళ్లనించీ తెలుసుగదూ. నన్ను అభిమానంగానే చూస్తారు. వాళ్లమ్మ తినటానికేదో ఒకటి పెడుతూ వుండేది'' అనుకున్నది సీతారత్నం.

2

పుస్తకాలు సద్దుతున్నట్టు బెడ్‌రూమ్ క్లీన్ చేస్తున్నట్టు సీతారత్నం ఒక్కొక్క పుస్తకమే దులుపుతున్నది. పేజీలు గబగబా తిప్పుతుంటే ఒక లేఖ కిందబడింది. అందుకుని విప్పింది.

''షుడేకారికి,

మగవారిని లూర్ చేసి వెంటేసుకుని తిరుగుతుంటే, బాగా కీర్తి ప్రతిష్ఠలు వస్తున్నాయనుకుంటున్నావేమో. ఇప్పటి నించే వృత్తి మొదలెట్టినట్టున్నావు. మీరంతా అదే బిజినెస్ రన్ చేస్తూ వన్నెల విసనకర్రల్లాగా తయారై వీధి గడపలో కనబడతారు. కదాచిత్‌గా లోపలుంటారు. నాకు పట్టినదిదిగాదు. నా బిడ్డ నీకన్న వయసులోనే కాదు తెలివితేటల్లోనూ చిన్నవాడే. ఇంకా చిన్నది నా కూతురు. దాన్నీ నీ మార్గంలోకి నడిపిస్తున్నావు. కాకిముక్కుకి దొండపండులాగా యెర్రగా పుల్లగా వున్నవాడే నీ పక్కన నడవాలా? వాడిని వాడి మానాన వదిలేస్తే నీ రాబడికేమీ లోపముండదు. వాడిని వదిలేద్దూ నీకు పుణ్యముంటుంది. సుజన జీవనరావు''. సీతారత్నం మడతలు మారకుండా యధాతథంగా మడిచి లేఖ పుస్తకంలో పెట్టి దుమ్ముదులిపి షెల్ఫులో అమర్చింది. తెలుగు నిఘంటువు జారి కిందబడింది. దాన్ని తీస్తుంటే అందునుండి మరో లేఖ కిందబడింది. విప్పి చదివింది.

'' ఇలోపయిన సరోజినమ్మ కూతురా! మా వాడిని వంచించకు. వాడి పేరే వెర్రినాగన్న. ఒట్టి అమాయకుడు. వెర్రెల్ అని పిలిచేదందుకే. తగులుకోటానికి వేరే యెవరూ అందలేదా? చెరువులో చాలా చేపలున్నాయి. గోల్డ్‌ఫిష్‌ని పట్టాలే పిచ్చి మొహమా. సిల్వర్ ఫిష్‌ని పట్టావు. జోగీజోగీరాచుకుంటే బుట్టెడు బూడిదరాలుతుంది. మొదటి తప్పిదం కింద వార్నింగిచ్చి వదులుతున్నా. వినకపోయావో భజీతు చేస్తాను. కాలో చెయ్యో విరిపించి కాలవలో పడేయించగలను. నాకు డబ్బంటే గడ్డిపరక. యెలా సద్వినియోగం చేయాలో నాకు తెలుసు. కాలనాగు''.

ఇంకో నాలుగుత్తరాలు చదవగానే ఒళ్లు జలదరించింది సీతారత్నానికి. అడుగు అరదులుపుతుంటే మరో రెండు వుత్తరాలు చింపి చదివి భద్రంగా మడిచి పెట్టినట్లున్నవి దొరికాయి.

''మా అబ్బాయికి మతిబోవటానికి నువే కారణం. వాడు నీ విరహం భరించలేక పుండరీకుని లాగా నిస్త్రాణ పుట్టి మంచాన బడ్డాడు. వాడు రాసి నీకు పోస్టు చేయటానికి భయపడి, దాచిన వుత్తరం నా కంటపడింది. డిజప్పాయింట్ మెంట్ నిస్పృహలకు లోనై వికలమైనాడు. యెందుకు ప్రామిస్ చేశావు? ఆ వుత్తరం పోలీస్ స్టేషన్లో యిచ్చానంటే నీ పని సరి. ఇలా యెంతమంది వయసొచ్చిన యువకుల గొంతులు తడిగుడ్డతో నులుపుతున్నావు? పట్టుబడనని ధీమాగాబోలు. అవినీతి యేనాటికైనా పైకి తేలుతుంది. కొఱివి గాలం రావు''.

మరో బాగా పాత ఇన్‌లాండ్ కవర్. చిరిగి దుమ్ము చేరింది.

'' అంతగా నిన్ను నీవు కంట్రోల్ చేసుకోలేకపోతే, కుక్కల్ని, గాడిదల్ని మచ్చిక చేయి. దొడ్లో రెడీగా వుంచుకో. వాటికీ ఋతుసమయమున్నది. బాగా పనికివచ్చి తృప్తినిస్తాయి. నువ్వు చల్లే మత్తుమందు పేరు మా కుర్రాడా చెబుదూ. వేంవమూ సంపాదనపరులం కావాలి. వెలగల దుస్తులెక్కడ నించి వూడిపడుతున్నాయి నీకు? పూలూ సెంటూ ధరపెరిగినాయే? చెప్పులు పాతబడకముందే కొత్తవి వూరికేనే షాప్‌కీపరిస్తాడా?'' తల తిరగటం మొదలైంది సీతారత్నానికి. అన్నీ దుమ్ముదులిపి సద్దేశింది. గుడ్డల బీరువాకి తాళం లేదు. ఓరగా తీసివున్నది. నలిగిన, కూరిపెట్టిన గుడ్డలు తీసి చక్కగా మడతలు పెట్టి బొత్తులు పెట్టింది. ఒక బొద్దింక, ఒక బల్లీ, ఒక యెలుకపిల్లా దూకి పారిపోయాయి. దూరంగా నిలబడింది. మళ్లా వచ్చింది. పై అరలోని దుస్తులు తీసింది. పెద్ద ప్యాకెట్ కిందబడింది. దానిమీద ప్రళయలేఖలు అని రాసి పెట్టి తెల్లకాగితం అంటించబడి వున్నది. రంగు రిబ్బన్‌తో కట్టబడివున్నది.

ముడివిప్పి ఒక కాగితం తొలగించి, ప్యాకెట్ వదులు చేసింది. ఒక ఇన్‌లాండ్ కవర్ తీసింది. కాశీనించి వచ్చినట్టున్నది. కాశీ పోస్ట్ ముద్ర. తల్లి

వ్రాసిందేమో. వెనక్కు తిప్పితే ఆమె పేరు సోమమ్మ అని యింగ్లీష్‌లో వ్రాయబడి వున్నది. అడ్రసు వుత్తరం విప్పింది. తెలుగులో వింటూ యింగ్లీషులోకి తర్జుమా చేసి వ్రాసి నట్టున్నది. మంచి యింగ్లీష్ రాదేమో. తెలుగు లిపి రాదేమో. వాడాల్సిన పదం గుర్తురాక, గుర్తు వచ్చినదే వాడినట్టున్నది.

''గంగకి,

నేను యింటికి రావటానికి రైలు ఛార్జీలు లేవు. గంగా స్నానం చేస్తుండగా తెలిసినవాళ్లు కనబడితే వాళ్లతో వాళ్ల యింటికి వచ్చాను. యాత్రకి బయలుదేరినప్పుడే నిన్ను మర్యాదగా అడిగితే, నువ్వు మొండి చెయ్యి చూపించావు. నీ మెరిట్ స్కాలర్‌షిప్ యేంచేస్తున్నట్టు? యే కాలవలో కొట్టుకుపోతున్నదీ? నీ తిప్పటా నువ్వూ నువే వాడికి యెదురు పెట్టుబడి పెడుతున్నావా? అదేం తెలివీ? వ్రతం చెడ్డా ఫలం దక్కాలి. తిండికి మొహం వాచివున్నదా? సంబంధాలు తరిమేస్తావెందుకూ? నీకు బ్లాక్‌మెయిల్ చేయటమూ రాదు, నే చెపితే తల్లోకెక్కించుకోవు. అల్లునికి రెండే గుణాలుట, తనకు తెలియదు, ఒకరు చెపితే వినడు. పోనీ ముక్కు పిండి లాగేయటమూ అంతంత మాత్రమే. వడేసిపట్టి యాగీ చేస్తే వూడిపడదా? వృధాగా అప్రతిష్ఠ తెచ్చుకున్నావు. యేదో కన్నకడుపని చూస్తున్నా. నువ్వీయకపోతే అట్టే వుంటుందా? తల్లి ముసలి అయింది, మతాచార ప్రకారం గంగా స్నానం చేయాలామె అని తెలియదా? మా అమ్మాయి తీరుస్తుందని నమ్మబలికి మనింటి వెనక పాకలో వున్న కామేశ్వరి నడిగి డబ్బులాగ గలిగాను. అది అయిపోయింది. నేనింకా పూరీ యాత్ర చేసి వస్తూ దోవలో దిగి మా వాళ్లను చూడాలి. అరసవిల్లి, శ్రీకూర్మం, సింహాచలం దర్శించాలి. వెంటనే తీగ టపా ద్వారా స్పీడ్ పోస్ట్ ద్వారా డబ్బు పంపు. ఇంటికి రావద్దా నేను? పంపక మూర్ఖించావంటే అప్పు చేసి వస్తాను. నీకు చాతగాని పని నాకు చేతా. నీ పేరు చెప్పి నీ ఫ్రెండ్సు దగ్గరనుండి లాగగలను. సోమమ్మ''.

వుత్తరం మడిచేసింది సీతారత్నం. కొన్ని యింగ్లీషులోను కొన్ని హిందీలోను, ఒకటి రెండుత్తరాలు సంస్కృతంలోనూ వున్నాయి. హిందీలో వుత్తరం అప్ప రాసినట్లున్నది.

''నీవు కొంపలు మాపే కొరివ్వి. శూర్పణఖవి. నా లవ్వర్ను నా నుండి విడదీయగలిగావు. వాడు నాకు నీతో పరిచయం కాకముందునుంచే తెలుసు. యెన్నో కలలు కంటూ వెడ్డింగుకి సిద్ధమౌతుండగా, సందట్లో సడేమియా అని పానకంలో పుడకలాగా నువ్వు నేనున్న చోటికి పనివేళా వచ్చి, నా లవ్వరుకి మందుపెట్టి మతి విరిచేశావు. నిన్ను మరిగి, వాడు నన్ను మరిచాడు. వచ్చినా నీ ముద్దులే వల్లిస్తాడు. నువ్వేం చేయాలంటే, గంగా, వాడిని నా కొదిలి మరొకడిని వలవేసిపట్టు. అదీ సమర్థత అంటే. యెట్లా ఆకర్షిస్తావో గాని ఓ డజన్‌మంది నీ దాసులైనారిప్పటికి. నీ టక్కుటమార విద్యల్లో నాక్కూడా కొన్ని నేర్పుదూ. నేను వాడినిపట్టాలి. మరోదండ లేదు. కట్టుకున్నవాడు చెప్పాపెట్టకుండా పసిఫిక్ మహాసముద్రంలోవున్న టైటానిక్ అనే పెద్ద ఓడలోకి వెళ్లాడు. మరింక ఐపు లేడు''.

మరోటి చిన్నది అన్నేమో వ్రాశాడు. ''నువ్వు నాకు చెందాల్సిన నాల్గు యెకరాల మాగాని భూమి మేడా అమ్మచేత నీపేర రిజిస్టర్ చేయించుకున్నావు. అవి నీకు వంటబట్టవు. నాకే చెందాలి''.

మరో నాల్గు చదివి సీతారత్నం పెట్టిన పెడబొబ్బలకి బావివద్ద బట్టలుతుకుతున్న అమ్మమ్మ, కూరలు కోస్తున్న పింతల్లి, అరిటాకులు కోస్తున్న మేనమామ పరుగెత్తుకొచ్చారు. తేలుకుట్టిందో, పాము కాటేసిందో, మండ్రగబ్బ డెక్కలతో పట్టుకున్నదోనని భయపడివచ్చారు బెడ్‌రూమ్‌లోకి.

సీతారత్నం కళ్లు పెద్దవైనై. జుట్టు పీక్కుంటున్నది. చీరచింపుకుంటున్నది. గంతులేస్తున్నది. కిందబడి స్పృహ కోల్పోయింది.

పాపం! అని జాలిచెంది మోసుకెళ్లి దగ్గర్లోనే వున్న దయాసాగర్ నర్సింగ్‌హోమ్‌లో యెడ్మిట్‌చేశారు. ఆయన శ్చిజోఫ్రెనియాకి, పారనోయియాకి, సైకోలకీ, నయం చేసే థెరపీ తెలిసిన సైకియాట్రిస్టు. తాపీగా అంతా విన్నాడు. ట్రీట్‌మెంట్ ఇచ్చాడు. వాళ్లింటి పేరే అది. వీళ్లు ఇంటికొచ్చి బెడ్‌రూమంతా చక్కగా సర్ది భోజనం చేశారు.

## 3

పాశర్లపూడిలో బ్లో ఔట్ చూసి గంగారత్నం మూడో నాడిల్లు చేరింది. రాగానే వివరాలు విన్నది. స్నానం చేసి తలార పెట్టుకుని, ముడేసుకుని, భోజనం ముగిశాక, మంచి గుడ్డలేసుకుని, పన్నెండు గంటలకి, తాపీగా దయాసాగర్ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళింది. సింగిల్‌రూమ్‌లో బెడ్ మీదున్నది సీతారత్నం. వాళ్ళవాళ్లు పదిన్నరకి వచ్చి భోజనం తినిపించి, తలదువ్వి గుడ్డలు మార్చి, విడిచినవి తీసుకుని వెళ్లిపోయారుట.

డాక్టర్ దయాసాగర్ యింటికెళ్లబోతూ గంగా రత్నాన్ని చూసి రూమ్‌లో కొచ్చి నిలబడి చెప్పాడు.

''యేదో చూడరానిది చూసిందో, చదవరానివి చదివిందో మీ ఫ్రెండు. షాక్ తాకింది. దానికి ప్రతిక్రియగా షాక్ థెరపీ అప్లై చేశాను. ఇవాళే సరిగా తెలివివచ్చి తిన్నగా జవాబులిస్తున్నది మీ ఫ్రెండు. మళ్లా షాక్ తాకే సంభాషణ చేయరాదు. ఏదో ఫార్మల్‌గా, హెల్త్‌ను గురించీ వెదర్ని గురించీ మాట్లాడాలి'' అన్నాడు పేరు సార్థకం చేస్తూ.

''అలాగే డాక్టర్! థాంక్యూ'' అన్నది నిలబడి వున్న గంగారత్నం. డాక్టర్ వెళ్లిపోయాడు.

గంగారత్నం మెల్లిగా బెడ్‌మీద కూచుని సీతారత్నం వంకే చూస్తున్నది.

సీతారత్నం మెల్లిగా కళ్లు తెరిచి ఫ్రెండుని గుర్తుపట్టింది. సగం లేచి కంఠం వాటేసుకున్నది.

''గంగా! ఆపాడు వుత్తరాలన్నీ భద్రం చేశావెందుకు? అన్ని నిందలెలా భరించావు?'' అన్నదేడుస్తూ.

తలమీద రాస్తూ కళ్లు తుడుస్తూ, హృదయానికి హత్తుకుంటూ వీపు తట్టుతు అన్నది గంగ.

''వూరుకో. వూరుకో. నీకు పట్టిన అసూయ అనే వ్యాధి యీ మందుతో

నయంగావాలని, వాటిని భద్రం చేశాను సీతా! మా వాళ్లు నేరాగానే చెప్పారు. నువ్వొచ్చి స్వతంత్రంగా బెడ్‌రూమంతా కెలికావని. అసూయవల్ల మెంటల్ బాలెన్స్ కోల్పోయే అవకాశమున్నది. నీ అసూయ పెరిగిందే గాని తరగలేదు. గమనించాను. నువ్వడిగినప్పుడు నేనే నీకు చూపుదామనుకున్నా గానీ, నువు దూస్రోంకీ చిఠ్ఠీపత్రీ పఢ్‌నా పసంద్ కర్‌తీహై అని తలచి, యేదో ఒకనాడు నేను యింట్లో లేనప్పుడొచ్చి కెలికితే ఆ ప్రేమలేఖలు నీకంటబడతాయని భద్రం చేశాను. నిన్ను పట్టి పీడిస్తున్న వ్యాధి కుదిరిపోయిందిప్పుడు. దేవునికి ధన్యవాదాలు. ఇక్కడే యింకో నాల్రోజులుంటావా? డిశ్చార్జ్ చేయించి మీ యింట్లో దింపనా?'' అన్నది వీపుమీద రాస్తూ.

''వద్దు గంగా. నీతో మీ యింటికి వస్తా. రానిస్తావా?'' అన్నది నవ్వూయేడుపూ కలిపి.

''తప్పకుండా మా యింటికి పోదాం రా. నువే నా ప్రేమలేఖలు నీచేతులతో పెద్దమంట వేతువుగానివి. డాక్టరుకి ఫోన్ చేసి డిశ్చార్జ్ చేయించి వస్తా పడుకో'' అని పడుకోబెట్టి తెల్లని దుప్పటి గుండెలదాకా లాగి వెళ్లింది గంగారత్నం.